కథా కౌముది

# పాదరసం - పి.వి.శేషారత్నం

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**'భారతీ ఎక్కడున్నావ్?'** కృష్ణమూర్తి కళ్ళు విప్పేందుకు ప్రయత్నించాడు. మసకగా పెద్దకొడుకు శ్రీహర్ష ముఖం కనిపించింది.

'నాన్నగారూ' చిన్నకొడుకు రంగనాథ్ చేతులు పట్టుకున్నాడు.

'మన ఇల్లు కూలిపోయింది. అమ్మ, మీరు, బుజ్జి, నానిగాడు మీరంతా ఆ శిధిలాలలో ఇరుక్కుపోయారు.'

'ఆయన నడుం విరిగిపోయింది. ఎక్కువ అలసిపోనీయకండి' డాక్టర్ అంటున్నాడు.

ఈసారి పిల్లల ఏడుపు వినిపించింది. 'మాట్లాడు తాతయ్యా! మాకు భయం వేస్తోంది.'

'మీ బామ్మ ఏదీ?' కృష్ణమూర్తి అడిగాడు.

'జాగ్రత్తగా నెమ్మదిగా కళ్ళు విప్పండి. కృష్ణమూర్తిగారూ ఇపుడు మీరు బాగా చూడగలుగుతున్నారా?'

'లేదు కాస్త మసకగానే ఉంది. అయినా నా కళ్ళకేమయింది?'

భారతి తనకు కళ్ళు దానం చేసి శాశ్వతంగా కాశీవిశ్వనాథుని సన్నిధికి చేరుకుందని కొడుకులు చెబుతుంటే తట్టుకోలేకపోయాడు.

'మావయ్యా! ఎవరిని బరువుగా భావించి శాశ్వతంగా కాశీ పంపేయాలనుకున్నామో ఆ అత్తయ్యగారి గుండె లేకపోతే నాకు ప్రాణమే నిలచేది కాదు. ఆవిడ కళ్ళే మీ కళ్ళుగా నన్ను అభిమానంగా చూస్తున్నాయి. అసలు మీరు అంత ధైర్యం చెప్పకపోతే నా బుజ్జి నాకు దక్కేదే కాదు.' కోడలు కళ్ళు వత్తుకుంటోంది.

'ఏవండీ ఏమిటా మొద్దు నిద్ర? లేవండి. అపుడే ఎదురింటి సుభద్రమ్మ. సారంగపాణి కాఫీలు తాగేసి వాకింగ్‌కి కూడా వెళ్ళిపోయారు. మనం వాళ్ళకంటే ముందే వెళ్ళి మరో అరగంట వాకింగు ఎక్కువ చేద్దామన్నారుగా. అపుడే మర్చిపోయారా?' తన మొహాన ఇన్ని నీళ్ళు కొడుతూ లేపుతున్న భార్యను చూసి తెల్లబోయాడు కృష్ణమూర్తి.

'అదేమిటీ ఇవాళ మన కాశీ ప్రయాణం కదా!'

'చాలు చాల్లే.. ఊరుకోండి. ఏదో అత్తాకోడళ్ళం ఓ మాట అనుకున్నాం కదా అని ఏకంగా మనం కాశీకి వెళ్ళిపోవడమేనా? బుజ్జి నేను పక్కలో లేకపోతే నిద్రపోదు. చిట్టి, నానిగాడు మీరు కథలు చెప్పకపోతే ఊరుకోరు.'

'అవునూ నువ్వు పోయావుకదే! నీ కళ్ళు నాకు దానం చేసావు. గుండేనేమో కోడలికి?'

'అమ్మో అమ్మో ఏకంగా నన్నే చంపేసారూ! చూడండి కుటుంబం కూడా వాహనం లాంటిదే పొరపచ్చాలు రిపేర్లులాంటివి. వాటిని సరిచేసుకుని ఆనందంగా అపురూపంగా నడుపుకుపోవడమే జీవితం. మీకు మెలుకువ వచ్చిందా లేక గట్టిగా గిల్లనా?'

'అయితే మన ఇల్లు కూలిపోలేదూ?'

'ఇది మరీ బావుంది. పైన ఓ వాటా వేస్తే బావుంటుంది అని పెద్దకోడలు ఓ మాట మనల్ని అడిగిందో లేదో 'పాత ఇంటిమీద మంచిదికాదమ్మా' అనేసారుగా. అపుడే మీ కలలో ఇల్లు కట్టేయడం అది కూలిపోవడం కూడా అయిపోయాయన్నమాట. ఇంకా నయం భూకంపం వచ్చి మనమంతా అందులో పోయాం అన్నారు కాదు.'

కృష్ణమూర్తి తనకి ఆ స్వప్నం ఎందుకొచ్చిందా అనే ఇందాకటినుంచి ఆలోచిస్తున్నాడు. ఈ మధ్యనే ఎక్కడో చదివాడు ఉదయం మనసుమీద ముద్రవేసిన మాటలుగాని సంఘటనలుగానీ పడుకోగానే కలలరూపంలో వస్తాయని. అదీ సంగతి. అయితే రాత్రి టీవీలో భూకంపాలు గురించి చూసాడు. లేచీ లేవడంతోటే తల కొట్టుకుంటున్న భర్తను వింతగా చూసింది భారతి.

'ఏమిటో ఈ జన్మకి మీరు నాకు అర్ధంకారు కదా! త్వరగా తెమలండి' వాకింగ్ సూట్‌లో తయారయిపోయిన భారతిని చూసి ఫక్కున నవ్వాడు కృష్ణమూర్తి. తర్వాత గాఢంగా నిట్టూర్చాడు. 'నీకు నేను అర్ధం కాకపోయినా పరవాలేదు. పిల్లల హృదయాలు అర్ధం చేసుకో పిచ్చి మొహమా? నిన్న ఈ ఇంటికి పైన ఓ అంతస్థు వేస్తే బావుంటుంది కదా అని నీరజ మన మనసులో ఓ బీజం వేసిందీ అంటే రేపో ఎల్లుండో మన పిల్లలంతా ఈ ఇంటిస్థలాన్ని డెవలప్‌మెంటుకి ఇచ్చెయ్యాలని ఆలోచన చేస్తున్నారని అర్ధం చేసుకో.'

వాకింగ్ చేస్తూ కృష్ణమూర్తి అన్నమాటలకు విచారంగా ఆలోచనలో పడింది భారతి.

అదిగో అలాంటి సమయంలో కృష్ణమూర్తి కాలేజీ నేస్తం శంకరం మిత్రుని ఢిల్లీకి ఆహ్వానిస్తూ రైలు టికెట్లు కూడా జతచేసి పంపించిన ఉత్తరం కృష్ణమూర్తి దంపతులతోబాటు వాళ్ళ సంతానాన్ని కూడా ఆనందాబుధిలో ముంచెత్తింది.

సరిగ్గా నాలుగేళ్ళ క్రితం ఇలాగే గౌరీశంకరంగారు తమను టిక్కెట్లు పంపి మరీ తన ఇంటికి ఆహ్వానించడం రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో తమ తొలిసారి ప్రయాణం, ఆనాడు తామిద్దరూ రైలు దిగిన వెంటనే మిత్రులిద్దరూ దాదాపు పాతికేళ్ళ తర్వాత కలుసుకున్నప్పటి వాళ్ళ కళ్ళలోని ఆనందం భారతి కళ్ళముందు కదలాడింది.

***

'ఒరేయ్ కిష్టుడూ' రాజధాని ఎక్స్‌ప్రెస్ దిగి భార్యామణితో సహా భారత రాజధాని కొత్తఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొలిసారిగా అడుగుపెట్టి అటూ ఇటూ పరకాయించి చూస్తున్న బాల్యమిత్రుడు కృష్ణమూర్తిని బలంగా వాటేసుకున్నాడు అరవయ్యేళ్ళ గౌరీశంకరం.

'ఎంతకాలమయిపోయిందిరా నిన్ను చూసి?' అంటున్న కృష్ణమూర్తి మొహం వెయ్యివోల్టుల బల్బులా వెలిగిపోయింది.

'కిష్టుడూ నువ్వేం మారలేదురా! అదే ధోవతి లాల్చీ. అసలు సిసలైన తెలుగు మేష్టారి వంటే నువ్వే' భుజం మీద గట్టిగా చరిచాడు గౌరీశంకరం. పట్టరాని ఆనందం వస్తే అతని ధోరణే అంత.

'నువ్వు మాత్రం? నీ సూటూ బూటూ దర్జా వదిలావా ఏంటి? ఓహ్. కాలేజీ రోజుల్లో మండు వేసంకాలంలోనూ సూటు వదలని నిన్ను మన మిత్రబృందం ఏడిపించడం మర్చిపోయావు కాబోలు.'

'ఇదిగో అన్నయ్యగారూ! ఇక్కడ భారతి అనే ప్రాణి ఉందని మరిచిపోయి మీ బాల్య స్నేహితులిద్దరూ ఫ్లాట్‌ఫారం మీద ఎంతసేపని అలాగే వాటేసుకుని కలల్లో విహరిస్తారు?'

భారతి మాటలతో ఈ లోకంలోకి అప్పుడే వచ్చినట్లుగా 'నువ్వున్నావుగదే అర్థాంగినివి నన్ను కలల్లో కూడా కాసేపు సుఖంగా విహరించనీకుండా ఈ లోకం లోకి లాక్కు రావడానికి' విసుగు నటించాడు కృష్ణమూర్తి.

'విన్నారా అన్నయ్యగారూ! ఇదీ వరస. మీరు కనిపించగానే నేను పానకంలో పుడకనయిపోయాను ఈయనగారికి. రైల్లో ప్రయాణం చేసినంతసేపూ మీ నామ స్మరణ వదిలితే ఒట్టు.'

'వాడంతేనమ్మా. ఏమా ప్రయాణం బాగా అయిందా?' కృష్ణమూర్తి చెయ్యి వదలకుండానే గౌరీ శంకరం భారతిని పలకరించాడు. తర్వాత దర్జాగా రాజహంసలాంటి తన కారులో ఎక్కించి తనే డ్రైవ్ చేస్తుంటే 'మా శంకరంగాడు ఎంత స్థితిమంతుడయ్యాడోనని' కృష్ణమూర్తి కళ్ళు చెమర్చాయి.

'ఏదో నువ్వు నీమీద ఒట్టు పెట్టుకుని మా యిద్దరికీ టిక్కెట్లు కొని పంపించకపోతే రాజమండ్రి దాటి ఎరగనివాళ్ళం మేం ఇలా రాజధానికి రావడమనేది ఈ జన్మలో జరిగే పనేనంటావా గౌరీశంకరం?'

'అబ్బే.... నీ యీ మాటలతీరు అదీ నువ్వేం మారలేదురా?' అంటూ మళ్ళీ జబ్బమీద బలంగా చరిచాడు గౌరీశంకరం.

ఇంద్రభవనంలా ఉంది యిల్లు. ఇంటిముందు అధునాతనంగా పెద్ద గార్డెన్.

'లోపలికి రండన్నయ్యగారూ. వదినగారూ ప్రయాణం బాగా జరిగిందా?' ఢిల్లీలో ఉంటున్నారు కదా గౌరీశంకర్ భార్య అనసూయ ఏ పంజాబీ డ్రెస్సో వేసుకుని జుట్టు విరబోసుకుని దర్శనం ఇస్తుందనుకున్న దంపతులకు చక్కని హుందా అయిన వెంకటగిరి చీరతో కళ్ళనిండా కాటుకతో నిండుగా ఎర్రని కుంకుమబొట్టుతో, అచ్చ తెలుగు ఆడపడుచులాగా సంప్రదాయంగా స్వాగతం చెప్పేసరికి కాస్తంత ఆశ్చర్యపోయినా వెంటనే సర్దుకున్నారు.

ఏసీ ప్రయాణమే అయినా అన్ని గంటలు రైల్లోనే కూర్చోవడం వయసురీత్యా బడలికగానే అనిపించి కృష్ణమూర్తి భారతి భోజనాలయ్యాక కాస్త కునుకుతీసి లేచేసరికి టిఫిన్లు రడీ.

అనసూయ సాయంత్రం కొడుకులు కోడళ్ళు ఉద్యోగాలనుంచి వచ్చేసరికి చపాతీ పిండి కలిపేసి అన్నం, కూర వండేసింది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కోడళ్ళు చక్కగా స్నానాలు చేసి ఫ్రెష్ అయిపోయి వంటింట్లోకి ప్రవేశించి తక్కిన పనంతా నవ్వుతూ పూర్తిచేసేసారు.

భోజనాల దగ్గర వీళ్ళని తండ్రి పరిచయం చెయ్యగానే 'అంకుల్ మా అమ్మానాన్నగార్లకు మంచి కాలక్షేపం దొరికినందుకు మాకెంతో సంతోషంగా ఉంది.' అంటూ ఇద్దరినీ కుటుంబ సభ్యుల్లా కలిపేసుకుంటున్న వాళ్ళందరినీ చూస్తుంటే దంపతులకు తెగ ముచ్చటేసింది.

భోజనాలు చేస్తున్నప్పుడు కృష్ణమూర్తి కూడా వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోతూ 'మీ నాన్నకి గౌరీశంకర్ అనే ఆ పేరెలా వచ్చిందో చెప్పనా' అంటూంటే హాలంతా నవ్వుల పువ్వులు విరిసాయి.

'ఇదిగో చెల్లెమ్మా! కాలేజీలో చదివేటప్పుడు ఇప్పుడంత స్టయిలిష్‌గానూ ఉండేవాడేమో వీడికి గౌరీదేవి నుంచి తెగ ప్రేమలేఖలు వచ్చేవని నీకెప్పుడయినా చెప్పాడామ్మా' ఆ మాటలకి అనసూయ లేదని తలతిప్పుతూ నవ్వింది.

'ఆ తర్వాతేమయింది అంకుల్ చెప్పండి నాన్నగారు కూడా తిరిగి లవ్ లెటర్లు రాసారా? నాన్నగారికి గౌరి కనిపించిందా లేదా? ' గౌరీశంకర్ కొడుకులు, కూతురు, అల్లుడు సరదాపడుతూ కుతూహలంగా అడిగారు.

'ఆ..ఆ మీ నాన్న కూడా తెగ కవితావేశంతో వీరలెవెల్లో రాసేవాడు లవ్‌లెటర్లు. ఒకానొక శుభముహూర్తాన గౌరీదేవి, శంకరం, కాలేజి గ్రౌండ్‌లో రహస్యంగా కలుసుకోగానే వెనకనుంచి మా స్నేహ బృందమంతా ఒకటే నవ్వులు.. చప్పట్లు.'

'ఇదంతా నాకెప్పుడూ చెప్పలేదేమండీ?' కోపం నటించింది అనసూయ.

'పాపం! మరి వాళ్ళెందుకు పెళ్ళి చేసుకొలేదు. పెద్దవాళ్ళు ఒప్పుకోలేదా అంకుల్?' కొంటెగా అడిగాడు శంకరం అల్లుడు మనోహర్.

'వీళ్ళే ఒప్పుకోలేదయ్యా' గౌరీశ్వర్ అనబడే గౌరిని ఈ శంకరం ఎలా పెళ్ళి చేసుకుంటాడు? మిత్రులతో మాట్లాడే ప్రతిపదానికీ ఓ చక్కని ప్రాస కలిపి ఎప్పుడు కవిత్వం అల్లే వీడిని ఆట పట్టించడానికి మా స్నేహబృందం ఆడిన నాటకమది.'

'ఒరేయ్ కిష్టుడూ మా వాళ్ళముందు నన్నాట పట్టిస్తావా ఉండు నీ పని చెప్తాను' అంటూ శంకరం చిన్నపిల్లాడిలా కృష్ణమూర్తి జబ్బ చరిచేందుకు ఆయనని పట్టుకోవడానికి డైనింగ్ టేబుల్ చుట్టూ తిరుగుతూంటే అంతా ఘొల్లుమంటూ ఒకటే నవ్వులు.

'అన్నయ్యగారు మా ఆయనకీ కాలేజీలో నిజంగా ఓ రాధ ఉన్నా దయచేసి నాతో చెప్పకండి. నా గుండె ఇక్కడే ఆగిపోతుంది' అన్న భారతి మాటలకి అంతా కడుపులు పట్టుకున్నారు. ఆ రాత్రంతా ఇద్దరు మిత్రులూ ఒకటే కబుర్లు. కాలేజీ అవగానే గోదావరి ఒడ్డుకి పారిపోవడం పడవల్లోనూ, నావల్లోనూ తిరగడం, సెలవుల్లో అవతలి ఒడ్డుకి పోటీలు పడుతూ ఈదులాడడం, ఇదంతా ఒకరోజు గౌరీశంకర్ తల్లికి తెలిసిపోయి ఆవిడతో ముక్కు చివాట్లు తినడం, ఆవిడ ఇంకమీదట ఈతకు వెళ్ళనని ఏడుస్తూ ఒట్లు వేయించుకోవడం సెలవు రాగానే అవన్నీ గట్టున పెట్టేసి మళ్ళీ గోదావరి దగ్గరకు పరిగెత్తడం అన్నీ గుర్తుకొచ్చాయి.

ఆ మర్నాడు రెండో శనివారం. అందరికీ సెలవే. అనసూయ దర్జాగా ముగ్గురు కోడళ్ళకు పనులు పురమాయిస్తూ వాళ్ళతో కలిసి కబుర్లు చెబుతూ వారానికి సరిపడా జంతికలు, బెల్లం బూంది, తొక్కుడు లడ్డూలు, కారప్పుస వగైరా వగైరాలు చేయిస్తూంటే భారతి కళ్ళు తుడుచుకోవడం కృష్ణమూర్తి కంట బడింది.

ఏమిటో ఈ ఆడాళ్ళకి ఆనందమొచ్చినా విషాదం కలిగినా చప్పున కన్నీళ్ళొచ్చేస్తాయి. ఎంతైనా ఎప్పటికప్పుడు భావోద్వేగాలు వదిలించుకునే ఆడవాళ్ళే అసలైన అదృష్టవంతులనే చెప్పాలి. నేనలా చెయ్యలేకపోవడంతో ఒత్తిడి ఎక్కువైపోయి మాయదారి షుగర్ దాపరించింది అనుకున్నాడు కృష్ణమూర్తి.

భోజనాల దగ్గర అంతా పోటీలు పడుతూ ఒకటే సరదా కబుర్లు చెబుతుంటే ఆయనకయితే అన్నం తినకుండానే కడుపు నిండిపోయింది. గౌరీశంకర్ కోడళ్ళు కూడా ఎంతో చురుకైన వాళ్ళు కావడంతో చకచకా అత్తగారిని మన్నిస్తూనే వడ్డనలు, తక్కిన పనులు చక్కబెట్టేసి ఆ తర్వాత అత్తాకోడళ్ళు అంతా ఒకే దగ్గర సరదాగా కబుర్లు చెప్పుకుంటూ అన్నాలు తింటూంటే భారతి ఉత్సాహంతో వాళ్ళలో కలిసిపోవడం చూసి కృష్ణమూర్తి మనసు ఆనందతరంగితమయింది.

ఆడవాళ్ళకీ అప్పుడప్పుడూ ఇలాంటి ఆటవిడుపు అవసరమని తొలిసారిగా అర్ధమయింది ఆయనకి. ఇదంతా తప్పకుండా ఈ ఇంటి యజమాని చాకచక్యమే. లేకపోతే ఈ లోకంలో అత్తాకోడళ్ళను ఇలా నవ్వుకుంటూ చూడడం అంత తేలిక కాదనే చెప్పాలి. ఆ రోజు సాయంత్రం ఆడవాళ్ళంతా గుడికి వెళ్ళిపోతే, కృష్ణమూర్తి, గౌరీశంకర్, కొడుకులు మనవలతో కలిసి పార్కుకి వెళ్ళి అలిసిపోయేదాకా టెన్నిస్‌లాంటి ఆటలు ఆడాడు.

'నా మనవలతో ఒక్కనాడూ నాకిలాంటి అనుభవం కలగనే లేదు' మనస్ఫూర్తిగా అనుకున్నాడు కృష్ణమూర్తి. ఎప్పుడెప్పుడు ఇల్లు వాటాలు వేసేసి కృష్ణారామా అనుకోవడానికి అత్తమావలు కాశీకి పోతారా అని చూసే కోడళ్ళు గుర్తుకొచ్చారాయనకు.

వచ్చి అప్పుడే మూడు రోజులయిందంటే నమ్మబుద్ధి కావడంలేదు కృష్ణమూర్తి దంపతులకు. ఎందుకంటే ఇంటిదగ్గర కాలం ఎంత భారంగా కదిలేదే? ఇక్కడనుంచి కదిలి వెళ్ళేలోగా ఆ చిదంబర రహస్యాన్ని శంకరం నుంచి తెలుసుకునే తీరాలని నిశ్చయించుకున్నాడు కృష్ణమూర్తి. అయితే ఆ అవకాశం లేకుండా బుజ్జి బెంగపెట్టుకుందని వెంటనే బయలుదేరి రమ్మని కొడుకునుంచి ఫోన్ రావడంతో మర్నాడు ఉదయమే గౌరీశంకర్ తన పరపతినుపయోగించి ఎమర్జెన్సీ కోటాలో రాజధాని ఎక్స్‌ప్రెస్‌కే రెండు టిక్కెట్లు సంపాదించాడు.

'మీరొచ్చాక ఈ మూడురోజులూ ఇల్లంతా ఎంతో నిండుగా ఉంది. పిల్లలూ ఎంతో సంబరపడ్డారు. ఏమిటో ఓ పదిరోజులయినా ఉండివుంటే మాకు తృప్తిగా ఉండేది అన్నయ్యగారూ! ఈసారి మీకోసం పలవరించిపోయే మనవరాలిని కూడా వెంటబెట్టుకుని మరీ రండి. ఓ నెల్లాళ్ళు ఉండి వెళ్దురుగాని' అంటూ అనసూయ కృష్ణమూర్తి దంపతులకు బట్టలు పెట్టి కొడుకు కోడళ్ళ చేత దణ్ణాలు పెట్టించింది.

'నేను మీ ఇంటికి రాలేదులాంటి శంకలేమీ పెట్టుకోకు చెల్లెమ్మా! నేను మన ఆంధ్రదేశం వచ్చినప్పుడు మీ యింట్లోనే దిగుతానని మాట ఇస్తున్నాను. సరేనా? ఇది మీ యిల్లే అనుకుని ఎపుడు రావలనిపించినా ఒక్క ఫోన్ కొట్టండి నాకు.' అంటూ రైలు కదిలిపోయినా దానితోబాటే అలా చెయ్యి ఊపుతూనే శంకరం వాళ్ళు క్రమంగా కనుమరుగయ్యారు.

రాజమండ్రిలో రైలు దిగుతుంటే వాళ్ళ కుటుంబం మొత్తం స్వాగతం పలుకుతూంటే బిత్తరపోయారు ఇద్దరూ.

'అత్తయ్యగారూ మీరు లేని ఈ మూడురోజులూ ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం అనుకోండి' పెద్దకోడలు గొంతులోని ఆరాటంలో నిజాయితీ తళుక్కుమంటోంది.

'అవును నాన్నా! రాత్రిళ్ళు మీరిద్దరూ లేని ఇంటికి రావాలనే అనిపించలేదు.' శ్రీహర్ష, రంగనాథ్ తండ్రిని చుట్టేశారు. వాళ్ళ స్పర్శలో ఎప్పటిలాగా ఆర్థిక సంకేతం కాకుండా ఏదో ప్రేమ సంకేతం.

ఉద్యోగం చేసే చిన్నకోడలు పండరి నిష్ఠూరాలాడింది. 'మీకు ఎంతసేపూ కొడుకులమీదే ప్రేమ. మీరు ఊరెడుతున్నట్టు ఒక్క మాటైనా చెప్పారా? నేను క్యాంప్ నుంచి వచ్చేసరికి మీరింట్లో లేక ఎంత గాభరా పడ్డానో? అత్తయ్యా మీ మనవరాలు బామ్మకోసం ఎలా బెంగపెట్టుకుని చిక్కి శల్యమయిందో చూడండి.' ఫిర్యాదు చేసింది.

'అవును బామ్మా! ఇన్నాళ్ళు ఎందుకుండిపోయావు? నా కాలికి దెబ్బ తగిల్తే నువ్వు మంత్రం వేస్తే ఇట్టే తగ్గిపోయేది. చూడు ఎన్ని దెబ్బలు తగిలి అలాగే పెచ్చులు కట్టిపోయాయో' అంటూ మనవరాలు బామ్మని వాటేసుకుంటూంటే భారతికి కన్నీళ్ళు వద్దన్నా ఆగడంలేదు.

'తాతయ్యా నువ్వు లెక్కలు చెప్పలేదుగా అందుకే నాకు మార్కులు తగ్గిపోయాయి. ఇంకెప్పుడు నువ్వెక్కడికీ వెళ్ళొద్దు తాతయ్యా!' నాని చిట్టి మాటలకు ఏదో తెలియని ఉద్వేగంతో భారతి, కృష్ణమూర్తి ముఖముఖాలు చూసుకున్నారు.

అప్పుడప్పుడూ గౌరీశంకర్ గుర్తుకొస్తూంటాడు. ఇదిగో ఎందుకో మళ్ళీ ఈ మధ్య అందరికీ ఇల్లు చాలడం లేదని పైన అంతస్థు వేసుకుంటే బావుంటుందని పెద్దకోడలు మావగారి ముందు తీర్మానం పెట్టినందుకే ఈయనగారికి దుస్వప్నాలు, పలవరింతలు.

***

అదంతా గుర్తుకొచ్చి భారతి అడిగింది కృష్ణమూర్తిని.

'శంకరం అన్నయ్యగారు ఇలా సడన్‌గా మళ్ళీ టిక్కెట్లు పంపించి మరీ రమ్మన్నారంటే అక్కడ అంతా సవ్యంగానే ఉందంటారా?'

'భారతీ అనుమానం ముందుపుట్టి నువ్వు తర్వాత పుట్టావు. అలాంటిదేమీ లేదు. వాడంతే తలుచుకున్నప్పుడే తాత పెళ్ళి అనేరకం. రాత్రి ఏ కల్లోకో వచ్చి వుంటాను. వెంటనే చూడాలనుకుని అమలు చేసేస్తున్నాడు. అందుకే ఉద్యోగంలో కూడా అంత చక్కగా రాణించి మంచి ఇల్లు కట్టుకోగలిగాడు. చూసావుగా' ఎందుకో ఈసారి రాజధాని ప్రయాణం అంత థ్రిల్లింగ్‌గా అనిపించలేదు. అదంతా అలవాటయిన వాళ్ళలాగా ప్రయాణం చేసారు.

అందుకే అంటారు జీవితంలో ఒక్క స్నేహం తప్ప ఏదయినా అంతే. మొదటిసారే మురిపిస్తుంది. స్నేహం అయితే జీవిత పర్యంతం మనసును సేదదీరుస్తుంది.

స్టేషన్‌కు వచ్చిన శంకరం మిత్రుడిని ఆలింగనం చేసుకున్నాడు. ఇంటికెళ్ళేసరికి సందడి లేదు. పొద్దుటే పిల్లలంతా స్కూళ్ళకు, శంకరం కొడుకులు కోడళ్ళూ ఉద్యోగాలకు వెళ్ళిపోవడంతో ఇల్లు చిన్నబోయింది.

అనసూయ ఎక్కడా కనిపించకపోయేసరికి భారతి అటూ యిటూ వెతుకుతుంటే చెప్పాడు శంకరం.

'ఇవాళ రాత్రికే ఈ ఊళ్ళోనే మా పెద్దబావ మరిది ఇంటి గృహప్రవేశముందమ్మా! బాగా అలసిపోయి పడుకుని వుంటారు. ఫోన్ చేసి రైలులో మిమ్మల్ని లేపడమెందుకని మా బావమరిదితో ఉదయమే వెళ్ళిపోయింది. ఏమీ అనుకోకమ్మా! పోన్లే. ఇన్నాళ్ళకి నీ చేతివంట తినే అదృష్టం దొరికింది మీ అన్నగారికి.'

'దానికేం భాగ్యం' అంటూ భారతి చిరునవ్వుతో వంటమనిషి సాయంతో ప్రత్యేకంగా వంట చేసాక మళ్ళీ కబుర్లతో కాలక్షేపం చేస్తూ భోజనాలు చేసేసి కునుకులు తీయడం అయ్యాక శంకరం అడిగాడు.

'ఈ పూటేం చేద్దాంరా కిష్టుడూ. మన కాలనీ చివర థియేటర్‌లో పాత తెలుగు సినిమా 'కలసివుంటే కలదు సుఖం' వేస్తున్నారుట వెళ్దామా! ఏవమ్మా ఏమంటావు?'

'ఇంత చల్లనివేళ మన నందనవనంలో పూలపరిమళాలు ఆస్వాదిస్తూ కూర్చోకుండా సినిమా ఏమిటి అన్నయ్యగారూ. క్రితం సారి వచ్చినపుడు వదినగారూ నేనూ పోటీ పడుతూ సన్నజాజి మాలలు కట్టాం' గార్డెన్‌ను ఇంతింత కళ్ళు చేసుకుని చూస్తు పువ్వులను సున్నితంగా స్పృశిస్తున్న భ్రతికి అక్కడ జీవకళ కనిపించలేదు.

'ఇంత వయసొచ్చినా నీ సినిమా పిచ్చి తగ్గలేదేవిటిరా శంకరం? నిన్నా మొన్నా సెలవుకదా మీ పిల్లలందరితో కలిసి వెళ్ళకుండా ఇపుడు సినిమా ఏమిటిరా? అదీకాక ఇంకాసేపట్లో కొడుకులు కోడళ్ళు మనవలు వచ్చే వేళవుతోందాయె. అయినా ఉద్యోగాలతోనూ, చదువులతోను అలసిపోయి వస్తారు. ఇవాళ మనం సినిమాకి రమ్మన్నా వాళ్ళు వస్తారో రారో.'

గౌరీశంకర్ కొత్త సినిమా తొలి ఆటకే క్లాసులు ఎగ్గొట్టి వెళ్ళడం కృష్ణమూర్తికింకా గుర్తుంది. 'ఎవరి సంగతి నువ్వనేది. కొడుకులు, కోడళ్ళు మనవలు వాళ్ళిళ్ళకి వెళ్తారుగానీ మనింటికెందుకు వస్తారురా. నువ్వొట్టి అమాయకుడివి' అన్నాడు శంకరం ఎటో చూస్తూ.

'వాళ్ళిళ్ళకి వెళ్ళడమేమిటి? అంటే?' ఇంకా ఏదో అనబోయి ఆగిపోయాడు కృష్ణమూర్తి. అతనికేదో అర్థమయీ అవనట్టుంది.

'అంటే ఏం లేదులే మీరొచ్చినప్పుడు కూడా వారాంతం గనుక వాళ్ళంతా పిల్లలతో సహా ఎప్పటిలాగే ఇక్కడకు వచ్చి గడిపారు. మీ చెల్లాయి, నేనూ వాళ్ళు రాకముందు మూడురోజులూ వాళ్ళువస్తారనే ఎదురుచూపుతోను, వచ్చి వెళ్ళిన తర్వాతి మూడురోజులూ వాళ్ళతో గడిపిన రోజుల్ని నెమరువేసుకుంటూ గడిపేస్తుండేవాళ్ళంరా రాధా!'

ఆ తర్వాత కృష్ణమూర్తిని మాట్లాడనివ్వకుండా శంకరం కళ్ళు మూసుకుని చెప్పుకుపోయాడు. 'ఒరేయ్ కిష్టుడూ! నీకో సంగతి తెలుసా? చిన్నప్పుడు మీ ఉమ్మడి కుటుంబాన్ని చూసినప్పుడల్లా అమ్మ తప్ప ఎవరూ లేని నేను ఎంతో ముడుచుకుపోయేవాడిని. ఒకరోజు నువ్వన్నం తినకుండా స్కూల్‌కి వచ్చేసావని మీ బాబాయి క్యారేజీ మోసుకు వచ్చి నీకు ప్రేమగా తినిపించడం చూసి ఇంటికెళ్ళి నాకలాంటి బాబాయి ఎందుకులేడని మా అమ్మ దగ్గర ఎంత ఏడ్చానో. అమ్మ ఇచ్చిన తాయిలాలు నేను నీతో పంచుకుంటే 'ఇది మా చెల్లికి ఎంతో ఇష్టం' అంటూ అందులో కొంత దాచి నువ్వు మీ బాబాయి కూతురికి పెడుతుంటే ఆశ్చర్యంతో కళ్ళు ఇంత చేసుకుని చూడడం నువ్వు గమనించి ఉండవు. నాకూ ఎప్పటికయినా అలాంటి కుటుంబం ఏర్పడాలని ఓ కోరికగా దాచుకున్నానురా. కానీ నా దురదృష్టమదేమోగానీ మాకు పిల్లలనివ్వలేదు ఆ దేవుడు. అయినా నేను నిరాశపడలేదు' ఊపిరి తీసుకునేందుకు ఆగాడు శంకరం.

ఉలిక్కిపడ్డారు కృష్ణమూర్తి భారతి.

'నీలాగే ఎవరికీ వీళ్ళు ముగ్గురూ మా కడుపున పుట్టిన పిల్లలు కాదని తెలియదు.'

'మీ కొడుకులు కాదా! మరి?' భారతి ముఖంలో ఆశ్చర్యం అలాగే ఉంది.

'అప్పట్లో నేను జయపూర్‌లో పనిచేసేవాడిని. ఒకరోజు మా పక్క ఇంట్లో దంపతులు కలహించుకుని క్షణికావేశంలో ఉరిపోసుకుంటే ముక్కుపచ్చలారని వాళ్ళ ముగ్గురు పసిపిల్లల్ని చేరదియ్యడానికి బంధువులూ మిత్రులు ఎవరూ ముందుకు రాకపోతే మా పిల్లలుగా తెచ్చి అనాథలని వాళ్ళకు తెలియనీయకుండా పెంచాము మా అనసూయా నేనూను. అందుకే నా సంపాదనతో నా కొడుకులూ, కోడళ్ళూ, మనవలతో ఉమ్మడి కుటుంబంగా గడుపుదామనే.... చూసావుగా ఇంత పెద్ద ఇల్లు డిజైన్ చేసి కట్టించాను.'

'మైగాడ్! నీదెంత విశాల హృదయంరా. నువ్వు స్నేహితుడవని చెప్పుకోవడానికి ఇప్పుడు ఇంకా ఎక్కువ గర్వపడతాను. మూడు పసిప్రాణాలకు ఈలోకంలో ఆధారం కల్పించావు' కృష్ణమూర్తి శంకరం చెయ్యి నొక్కాడు.

శంకరం నవ్వాడు. 'కానీ మా పిల్లల దృష్టిలో నేనొక స్వార్థపరుడైన తండ్రిని. ఉమ్మడి కుటుంబం అంటూ వాళ్ళ ఆశలమీద నీళ్ళు జల్లుతున్న రాక్షసుడిని.'

'ఛ అలా ఎందుకనుకుంటారురా గౌరీ' ఓదార్పుకోసం అన్నాడేగాని కృష్ణమూర్తికి ఈ కాలం యువకుల మనస్తత్వ కొట్టిన పిండే తన బిడ్డలు లేరూ!

'పూర్వపు రోజులు వేరురా. వ్యక్తిత్వాలు ఏర్పడ్డాకనే పెళ్ళిళ్ళు చేసుకుంటున్న ఈరోజుల్లో అందరికీ స్వతంత్ర భావనలే. ఆదాయాలలో తేడాలవల్ల తోడికోడళ్ళ మధ్య పోటీ. అటు భార్యలను సమర్ధించలేక, సమర్ధించకుండానూ ఉండలేక ఇంట్లో తండ్రీ కొడుకులకు హైరానా. మా యింట్లోనే కాదు ఏ ఇంట్లోనయినా కాస్తో కూస్తో తేడాతో ఇదే పరిస్థితి అనే నిజం చాలాకాలానికి గానీ నాకర్థం కాలేదురా. పైగా మా చేతుల్లో పెరిగిన పిల్లలే పెళ్ళిళ్ళయ్యాక మాకు నీడలేకుండా చెయ్యాలని ప్రణాళికలు రచిస్తుంటే కృంగిపోయానురా కిష్టుడూ. ఇంట్లోని తలనొప్పులతో ఏడాది తిరక్కుండానే నాకు హార్ట్ ఎటాక్ వచ్చింది. ఆరోగ్యం పోయాకనే దాని విలువ తెలిసి ఇంట్లో శాంతం కావాలంటే ఏం చెయ్యాలో అదే చేసాను. నేను బ్రతికుండగానే నాకున్నదానిని నాతో సహా వాటాలు వేసి పంచేసి ఎవరి ఇల్లు వారికి ఏర్పాటు చేసేసాను. బ్రతికున్నన్నాళ్ళూ బద్ధశత్రువుల్లా ప్రతిరోజూ కత్తులు దూసుకోకుండా అప్పుడప్పుడూ వచ్చి పలకరించే పిల్లల ప్రేమాభిమానాలతో ఈ జీవితం ఇలా ఆనందంగా వెళ్ళిపోతే చాలనుకున్నాను. నేను పోయేలోగా ఒక్కసారి మళ్ళీ నీతో గడపాలనే ఇలా...'

కృష్ణమూర్తి కళ్ళు సజలాలయ్యాయి. 'పిచ్చి శంకరం'

'మరి వదినగారు?' భారతి మాటలు పూర్తికాకుండానే చెప్పాడు శంకరం.

'అదిగో వస్తోంది చూడండి.'

కారులోంచి దింపి చక్రాల కుర్చీలో కూర్చోపెట్టి ఒకావిడను తీసుకువచ్చాడు బక్కపలచటి ఓ వ్యక్తి. 'బావగారూ! చాలా పనులున్నాయి. నేను రేపు వస్తాను మళ్ళీ. అక్కను లోపలికి తీసుకెళ్ళండి' అంటూ వెళ్ళిపోయాడు.

ఆమె అనసూయా? నివ్వెరపోయారు కృష్ణమూర్తి, భారతి. బాగా ముసలిరూపు వచ్చేసింది. తలమీద జుట్టు పలచబడిపోయింది, కళ్ళు ఎక్కడో చూస్తున్నాయి.

'అయ్యో మనం పలకరించలేదని కోపం వచ్చిందేమోనండీ వదినగారికి?' భారతి నొచ్చుకుంది గానీ అనసూయ వీళ్ళెవరి వైపు చూడనేలేదు.

'అనసూయకు సడెన్‌గా ఏమయింది అంత అలిసిపోయిందెందుకని?' ఇద్దరి మనసుల్లోను అదే ప్రశ్న. జవాబు చెప్పేందుకు శంకరం అక్కడ లేడు.

శంకరం ఆమె దగ్గరకి వెళ్ళి బ్రతిమాలి తోటమాలి నీళ్ళు అందిస్తూంటే ఆమె కాళ్ళమీద పోసి కడిగాడు. తనే శ్రద్ధగా తుడిచాడు. తర్వాత తమకేసి కూడా చూసే తీరిక దొరకలేదు ఆయనకి.

అలసిపోయినట్టున్న ఆమెకి పసిపిల్లలా మొహం కడిగి, తల దువ్వి భోజనం తినిపించి మంచం మీద పడుకోబెట్టి దుప్పటికప్పాడు. అతని చర్యలని అన్నీ విభ్రమంగా చూస్తూండిపోయారు కృష్ణమూర్తి భారతి.

'ఓసారి ఇలా వస్తారా?' భారతి వెనుదిరుగుతుంటే వినిపించింది అనసూయ కంఠం.

బహుశా తమకు చెప్పకుండా అన్నగారి ఇంటికి వెళ్ళినందుకు క్షమాపణ చెబుతుందేమో అనుకుంది.

'పరవాలేదు వదినగారూ! మీకు ఆరోగ్యం బాగోలేనట్టుంది. విశ్రాంతి తీసుకోండి. పొద్దున్న మాట్లాడుకుందాం.'

'ఇంతకీ మీరెవరు?'

ఆవిడ ప్రశ్నకి భారతి విస్తుబోయింది. 'అదేమిటి వదినగారూ! నేనూ, మావారూ ఇదివరకు మీ యింటికి వచ్చాం గుర్తులేదూ?'

భారతి మాటలు విననట్టే అడిగింది అనసూయ. 'ఇదిగో మీరెవరోగానీ ఆయనకి కాస్త చెప్పండి ఇలా చెయ్యడం బాగాలేదని. అయినా మీకేమయినా తెలుసా ఆయన ఎవరో? రోజూ నాకు దగ్గరుండి అన్ని పనులు స్వయంగా చేసి పెడతారు. మీ పేరు ఏమిటి అంటే మాట్లాడరు. మీరెవరంటే చెప్పరు. ఇలా ఒకేచోట ఉంటే ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు చెప్పండి.'

ఏదో అనేందుకు నోరు తెరిచింది భారతి.

'అన్నట్టు మీరెవరు? ఈ ఇల్లు మీదా? ఇన్నాళ్ళూ మీరు కనిపించలేదేం?' కృష్ణమూర్తి భారతి నివ్వెరబోయి చూస్తుంటే వెక్కిళ్ళు వినిపించాయి వెనకగా.

'అనసూయకు అల్జిమర్స్‌రా కిష్టుడూ' మనమెవరమూ ఆవిడకు గుర్తులేదు. అలాగే పాతికేళ్ళు పెంచిన కొడుకులు, లాలించిన మనవలూ.. ఊహూ ఎవరూ గుర్తులేరు.'

అదిరిపడింది భారతి.

'మరి ట్రీట్‌మెంటు?'

'దీనికి ఇంకా పూర్తిగా రాలేదటరా? ఏదో నా తృప్తికోసం డాక్టరుగారు అపుడపుడు వచ్చి ట్రీట్‌మెంటు ఇస్తుంటారు. ఇవాళ మీరొస్తున్నారని నాకు వీలు కుదరకపోతే మా బావమరిది అనసూయని క్లినిక్‌కి తీసుకెళ్ళాడు.'

'ఎందుకిలా? డాక్టర్ ఏమీ చెప్పలేదా?'

'సాధారణంగా వయసుతోపాటు వస్తుందిట. కానీ అనసూయకు అందరూ ఇల్లు విడిచి వెళ్ళిపోవడంతో మనోవ్యాధితో వచ్చింది. వాళ్ళు ఈ ఇల్లు వదిలి వాళ్ళిళ్ళకు వెళ్ళిపోయిన కొత్తల్లో అపరాధభావంతోనయినా వారానికి రెండురోజులు సెలవులు ఇక్కడే గడిపి వెళ్ళేవారు. అందుకే శుక్రవారం సాయంత్రానికి కొడుకులు మనవలకోసం ఎదురుచూస్తూ నాకెన్నో పనులు పురమాయించేది. సోమవారం వాళ్ళందరూ వెళ్ళిపోయాక ఇలాగే ముసుగుపెట్టి పడుకుని మంచం దిగేది కాదు. క్రమక్రమంగా పిల్లలు బిజీ అయిపోయి రావడం తగ్గించేసారు. అనసూయ ఇప్పుడు వాళ్ళని పూర్తిగా మర్చిపోయింది. రోజు నేను చేయిస్తే తప్ప ఏ పనీ గుర్తుండదు. లేచిన దగ్గర్నుంచీ అలాగే కూర్చుంటుంది. ఆకలి దప్పిక ఏమీ తెలియవు. జరిగినవన్నీ మర్చిపోయింది. అంతవరకూ అదృష్టవంతురాలే. కానీ నన్ను కూడా మర్చిపోయిందిరా.'

మిత్రుని దుఃఖం కృష్ణమూర్తిలో కూడా భయాన్ని రేకెత్తించింది.

'ఇవాళో రేపో నా యింట్లో కూడా ఇలాంటి అల్జిమీర్స్ ప్రవేశించకుండా ఉండాలంటే మా నాన్న వారసత్వంగా నాకిచ్చిన పాత యింటిని ఘనంగా పెడితే చాలు, నా పిల్లలందరి దృష్టి దానిమీదేనని నాకుగాక ఇంకెవరికి తెలుస్తుంది. అయినా పైకి వెళ్ళేటప్పుడు ఈ భూములు, భోషాణాలు మనవెంట వస్తాయా పిచ్చిగాని' అనుకున్నాడు కృష్ణమూర్తి భారంగా నిట్టూరుస్తూ.

గౌరీ శంకర్ దుఃఖం సముద్రమంత అనంతంగా తోచింది కృష్ణమూర్తికీ, భారతికి.

నిజంగా అది దురదృష్టమే. కానీ అనసూయకి ఈ అల్జీమీర్స్ వ్యాధి మనోవ్యాధివల్ల వచ్చింది.

కానీ ఈకాలం సంతానానికి వచ్చిన అల్జీమీర్స్ మాటేమిటి? అంటే అదే ఆరోగ్యం ఉండి కూడా తమకు జీవనదానం చేసి పెంచిన తల్లిదండ్రుల్ని ఆ పిల్లలు నిర్దాక్షిణ్యంగా మరిచిపోవడం.

అయితే ప్రతితరం వారూ మర్చిపోతున్న ఒక నగ్నసత్యమొకటుంది.

"కాలం పాదరసంలాంటిది. ఎంతలో జారిపోతుంది? నిన్నటి యువతరం ఈనాటి వృద్ధతరమైనట్టే ఈనాటి యువతరంకూడా రేపటి వృద్ధులవక తప్పదు."

Click here to share your comments on this story